నేరుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు చేపట్టాలి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందచేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: నేరుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు కొత్తగా విధించిన యూజీసీ నెట్ నిబంధనల వలన పేద విద్యార్థులు పరిశోధన విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యార నరేష్, నెల్లి సత్య, భగత్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట వోడాఫోన్ ఐడియా ఉద్యోగులకు బుధవారం 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై సోమవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీటీఓ జార్జ్, నోడల్ ఆఫీసర్ జయలక్ష్మి, అడ్మిన్ ఫర్హీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాలలో బస చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ వసతి గృహాలలో వారానికి ఒక సారి బస చేయాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం విజ్ఞప్తి చేశారు. అలా చేయడం వలన హాస్టల్ విద్యార్థులకు ఇస్తున్న ఆహారం, కల్పిస్తున్న సౌకర్యాలు, చదువులు, ఇతర అవసరాలు దగ్గర ఉండి చూడవచ్చు అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లకు కోట్ల రూపాయలను ఖర్చుచేస్తున్నా మధ్య దళారీల చేతి వాటంతో నిర్వహణలో నాణ్యత లోపిస్తుందన్నారు.



రాంగోపాల్‌పేటలో...



సత్యం టాకీస్ చౌరస్తాలో..

దేశభక్తి పెంపొందేలా..

- స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాల శుద్ధి..ఆపై పాలాభిషేకాలు..
- పలుచోట్ల తిరంగా ర్యాలీలు..

సనత్‌నగర్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బుధవారం స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

- బల్కంపేట రోడ్డులో బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసనివాళులు అర్పించారు.
- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ నివాసితులు తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసేలా జెండాలను అందజేశారు. కార్యక్రమంలో వెంకటసుబ్బారావు, అమ్ము రాంప్రసాద్, రాజేందర్, గోస్క శ్రీనివాస్, అరకాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.
- అమీర్‌పేటలో సత్యం టాకీస్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహాన్ని శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, సంతోష్, గౌరవ్, మిథున్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



బల్కంపేట రోడ్డులో నాయకుల తిరంగా ర్యాలీ

మొక్కలు నాటిన ప్రముఖులు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు

రసూల్‌పురా: ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మడ్‌ఫోర్ట్ లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ, ఆంధ్ర సబ్‌ఏరియా కమాండర్, బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్, కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, జాయింట్ సీఈవో పల్లవి విజయవంశీ, అధికారులు పాఠశాలల విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు.

ఐదేళ్ల చిన్నారితో అసభ్యకర ప్రవర్తన

అడ్డగుట్ట: ఐదేళ్ల చిన్నారి పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. ఈస్ట్‌మారేడుపల్లి ప్రాంతానికి చెందిన ఓ ఐదేళ్ల చిన్నారి బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఓ వ్యక్తి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు చిన్నారి వెంటనే ఇంట్లోకి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ కోతతో ప్రజల అవస్థలు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో కొంత కాలంగా విద్యుత్ వేళా పాళా లేకుండా అంతరాయం ఏర్పడుతుంది. లాలాగూడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లాలాపేట, శాంతినగర్, లాలాగూడ తదితర ప్రాంతాల్లో తరచూ విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ నిలిపివేయడంతో ప్రజలు, వ్యాపార సంస్థల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని లాలాపేట వాసులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బుధవారం లాలాపేట ప్రాంతంలో సాయంత్రం వేళలో సుమారు ఒక గంట పాటు సరఫరా నిలిచిపోవడంతో దోమల బెడదకు ఇంట్లో, బయట ఉండలేక నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ అధికారులను సంప్రదించినా సరైన సమాధానం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఓయూలో అంతరిక్ష దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓ యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బుధవారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఖగోళశాస్త్రం విభాగం, ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు, సైంటిస్టులు పాల్గొని అంతరిక్షం గురించి వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, డీన్ ప్రొ.కరుణసాగర్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



అడ్డగుట్ట: కోల్‌కత్తాలో వైద్యురాలిపై లైంగిక దాడిచేసి హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రి వైద్యులు డిమాండ్ చేశారు. బుధవారం లాలాగూడ రైల్వే ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నల్ల బ్యాచ్‌లు ధరించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ స్టాఫ్ సర్జన్ ఎస్‌వీబీకే సాయి, అడ్మిన్ డాక్టర్ పద్మ, డాక్టర్ రమేష్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయండి



అసిస్టెంట్ సివిల్ సప్‌లై అధికారులతో సమావేశం అయిన కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారిని అకారణంగా తొలగిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కార్పొరేటర్ సామల హేమ సివిల్ సప్‌లై అధికారిని కలసి వివరించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సివిల్ సప్‌లై కార్యాలయంలో అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ కల్యాణ్‌ను కలసి ప్రజల నుంచి వచ్చిన వివిధ పిర్యాదులను కార్పొరేటర్ ఆయన దృష్టికి తెచ్చారు.

ప్రకృతి విధ్వంసంపై సమీక్ష జరగాలి

- విధ్వంసం సృష్టించే వరకు వెళ్లిపోయాం
- 'ఒక విధ్వంసం 1056/90 పుస్తకావిష్కరణలో వక్తలు

సనత్‌నగర్: ప్రకృతిని కాపాడి, పూజించే సమాజం నుంచి వచ్చాము..ఇప్పుడు అదే ప్రకృతిని శాసించే వరకు, విధ్వంసం సృష్టించే వరకు పోయాం అని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట చేసే పర్యావరణ, కాలుష్య విధ్వంసం సహించరానిదని, దీనిని మనం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఔషధాలు తయారుచేసే కంపెనీలే జబ్బులను అంటకడుతున్నాయని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న ఒక రిట్ పిటిషన్ ఆధారంగా చేసుకుని సమయమంత్రి చంద్రశేఖర శర్మ రచించిన 'ఒక విధ్వంసం 1056/90 పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో జరిగింది. పటాన్‌చెరులో ఉన్న ఫార్మా కంపెనీలు ఏవిధంగా పర్యావరణం విధ్వంసం సృష్టిస్తున్నాయో, అందుకు ప్రజా సంఘాలు ఏవిధమైన ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టారో సవివరంగా పుస్తకంలో పొందుపరిచారు. దీనికి అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేవలం పటాన్‌చెరులోనే కాదు..ప్రపంచం మొత్తం పర్యావరణ విధ్వంసం జరుగుతుందన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. ప్రజలు ఉద్యమించనిదే మార్పు రాదన్నారు.

రావి ఆకులో ఎర్రకోటపై జెండా

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఎర్రకోటపై జాతీయ జెండా రెపరెపలాడుతున్నట్లుగా రావి ఆకుపై లీఫ్ కార్వింగ్ ఆర్ట్ వేసి అందరినీ ఆకట్టుకుంది సనత్‌నగర్ జెక్‌కాలనీకి చెందిన వాణిరెడ్డి. – సనత్‌నగర్



వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి యూత్ వింగ్ అధ్యక్షులు బోయ రమేష్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధికారం చేపడితే బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేఖలో కోరారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని 40 ఏళ్లుగా బోయలు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సుదీర్ఘ ఉద్యమాల అనంతరం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెల్లప్ప కమిటీ వేయడంతో పాటు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసినా ఇంత వరకు ఎస్టీ జాబితాలో చేర్చాలేదని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.